సమస్యల వలయంలో గురుకులాలు

- బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి, గురుకులాల ఇన్‌చార్జి జంగయ్య
- పాఠశాలలను సందర్శించిన నాయకులు

బొంరాస్‌పేట ఆశ్రమ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

కొడంగల్, డిసెంబర్ 6 : సీఎం నియోజకవర్గ కేంద్రంలోని గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని, సౌకర్యాలు లేక భోజన వసతులు సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి, గురుకులాల ఇన్‌చార్జి జంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకులం, బొంరాస్‌పేటలోని గిరిజన సావిత్రీబాయి పూలే పాఠశాల, దౌల్తాబాద్ మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురుకులాల సందర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని మహాత్మాజ్యోతిబా పూలే పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో మరుగుదొడ్లు, నీటి సమస్య అధికంగా ఉందన్నారు. పాఠశాల వాతావరణం అపరిశుభ్రంగా ఉందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని, ఉడికీఉడకని వంటలతో అర్ధాకలితో సతమతమవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు, విషపురుగుల సంచారంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారన్నారు. సరైన భోజనశాల అందుబాటులో లేకపోవడంతో ఇరుకైన స్థలంలోనే విద్యార్థులు భోజనాలు చేస్తున్నారని, పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు.

సీఎం నియోజకవర్గంలోనే..

సీఎం సొంత నియోజకవర్గంలోని గురుకులాల పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రంలోని గురుకులాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని జంగయ్య అన్నారు. సీఎం ఒక్కసారి సొంత నియోజకవర్గంలోని గురకులాలను సందర్శిస్తే ఇక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుస్తాయన్నారు. బొంరాస్‌పేట మండలంలోని ఆశ్రమ పాఠశాలలో తాగునీటి, మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. దౌల్తాబాద్ మండలంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు అసౌకర్యాల మధ్య చదువులు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గురుకులాల్లో నెలకొన్న సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ద్వారా అసెంబ్లీలో ప్రశ్నించేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, తిరుపతయ్య, రవి గౌడ్, హరియానాయక్, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.76కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

కొడంగల్, డిసెంబర్ 6 : ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగును ఇవ్వడంతో పాటు రాష్ట్రం, దేశాభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో రూ.6.50కోట్లతో నిర్మించిన సెంట్రలైస్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించడంతో పాటు నియోజకవర్గం పరిధిలోని 8 మండలాల్లో రూ.76కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మావేశంలో వారు మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో రూ.24.11కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అల్పాహారం అందించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌తో కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద కిచన్‌ను ఇక్కడ నిర్మించి, ఆధునిక సదుపాయాలతో విద్యార్థులకు శుచితో కూడిన పౌష్టిక అల్పాహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మొత్తంగా 312 పాఠశాలలకు సంబంధించి 28వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందుతుందన్నారు. విద్యార్థినులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పాలమూరుకు మహర్దశ ప్రారంభమైందని సీఎం పక్కా ప్రణాళికతో సాగునీటి ప్రాజెక్టులతో రైతులకు సాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, శంకర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, టూరిజం డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, వయాట్రీస్ హెడ్ మిచెల్ డోమినికాతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌నగర్‌ను సందర్శించిన సిక్కిం సర్పంచ్‌లు

మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌ను సందర్శించిన సిక్కిం రాష్ట్రంలోని సర్పంచ్‌ల బృందం

మొయినాబాద్, డిసెంబర్ 6 : రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థలో శిక్షణ నిమిత్తం వచ్చిన సిక్కిం రాష్ట్రానికి చెందిన సర్పంచ్‌లు వారి శిక్షణలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామాన్ని సందర్శించారు. వారి శిక్షణలో భాగంగా కొన్ని అంశాలను తెలుసుకోవడానికి క్షేత్ర స్థాయిలో సందర్శించారు. తెలంగాణలో గ్రామ పంచాయతీల నిర్వహణ, విధి విధానాలు ఎలా ఉంటాయి, గ్రామ పంచాయతీకి ఎన్ని రకాల ఆదాయాలు ఉంటాయని తెలుసుకున్నారు. ఆదాయ వనరులు ఏమి ఉంటాయి తదితర అంశాలను స్థానిక పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీకి జాతీయ ఫైనాన్స్, స్టేట్ ఫైనాన్స్‌తో పాటు పన్నుల రూపంలో, టీడీఎ ద్వారా ఆదాయం వస్తుందని మండల అభివృద్ధి అధికారి సంధ్య వారికి వివరించారు. ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చినప్పుడు, ఇంటి పన్నులు వసూలు చేయడం ద్వారా ఆదాయం వస్తుందని వివరించారు. తెలంగాణలోని పంచాయతీలకు మంచి ఆదాయ పనరులు ఉన్నాయని సిక్కిం రాష్ట్ర సర్పంచ్‌లు కితాబు ఇచ్చారు.

కన్హాశాంతివనంలో విద్యార్థులు, కళాకారులతో ఉత్తరప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్‌మౌర్య

భగవద్గీతపై అవగాహన అవసరం

నందిగామ, డిసెంబర్ 6 : ప్రతి మనిషికీ భగవద్గీతపై అవగాహన ఉండాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య అన్నారు. నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతి వనంలో మూడు రోజులపాటు జరుగనున్న గీతోపదేశ్ సమ్మిట్‌ను యూపీ ఉప ముఖ్య మంత్రి హాజరై హర్ట్ ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవ్‌ప్రసాద్ మౌర్య మాట్లాడుతూ.. గీత అనేది ఒక జీవన విధానమని, ఆధ్యాత్మికంగా, భౌతికంగా మన విజయవంతంగా జీవించడానికి ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్ మాట్లాడుతూ.. భగవద్గీత అనేది మతపరమైన సిద్ధాంతం కాదని, విజయవంతమైన జీవితాన్ని గడపడానికి సంపూర్ణ దృక్పథంతో జీవితాన్ని అర్థం చేసుకోవడంలో కీలకమన్నారు. గీతోపదేశ్ సమ్మిట్‌లో భగవద్గీతపై అనేక కార్యక్రమాలు, పోటీలు, పిల్లలు, యువత కోసం శ్లోక పఠనం, పోస్టల్ త యారీ పోటీలు, నృత్య ప్రదర్శనలు, సంగీత కచేరీ తదితర ఉంటాయన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో కలిసి పని చేయాలి

ఎస్పీ నారాయణరెడ్డి

హోంగార్డును సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 6 : శాంతి భద్రతల పరిరక్షణలో హోం గార్డ్స్ అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి పని చేయాలని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డ్స్ రైసింగ్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేక్ కట్ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వహిస్తున్న హోంగార్డు అధికారులు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. వర్షాకాలంలో వాగులు ప్రవహించినప్పుడు, ఎన్నికల సమయంలో, రోజువారీ విధుల్లో వారు అంకిత భావంతో పని చేస్తున్నారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు రక్షణ కల్పించడంలో బాధ్యతాయుతమైన సేవలు అందించడంతో పాటు పొరుగు రాష్ట్రాల్లో ఎన్నికల బందోబస్తులో అప్పగించిన భాధ్యతలను నిబద్ధతతో నిర్వహించారని వారి సేవలను కొనియాడారు. హోంగార్డ్ అధికారుల సంక్షేమానికి అన్ని వేళలా ముందుంటామని తెలిపారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందిస్తున్న ముగ్గురు హోం గార్డ్ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీవీ హన్మంత్ రావు, ఆర్ఐ డేవిడ్, అంజత్ పాషా, ఆర్ఎస్సైలు, హోం గార్డ్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, తెలంగాణ హోం గార్డ్స్ ఆర్గనైజర్ చాంద్ పాషా, జిల్లాలోని హోం గార్డ్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేని వైద్యుడు.. అక్రమ క్లినిక్

- జిల్లా ఉప వైద్యాధికారుల తనిఖీల్లో బహిర్గతం
- క్లినిక్ సీజ్

గ్లోబల్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న జిల్లా ఉపవైద్యాధికారి జీవరాజ్

పరిగి, డిసెంబర్ 6 : ఎలాంటి విద్యార్హతలు లేకున్నా ఓ వ్యక్తి ఎంబీబీఎస్ డాక్టర్‌గా చెలామణి అవుతున్నాడు. రిజిస్ట్రేషన్ లేకుండా ఓ క్లినిక్‌ను నిర్వహిస్తున్నాడు. తెలిసీ తెలియని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి ఆ క్లినిక్‌ను సీజ్ చేశారు. శుక్రవారం జిల్లా ఉపవైద్యాధికారులు డాక్టర్ జీవరాజ్, శ్రీనివాసులు, ప్రత్యేక బృందం పరిగి పరిధిలో అనుమతులు లేని దవాఖానల్లో తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా మార్కెట్ రోడ్డులోని గ్లోబల్ క్లినిక్‌లో తనిఖీలు నిర్వహించిన అధికారులు ఎంబీబీఎస్ డాక్టర్‌గా చెలామణి అవుతున్న రాజును సర్టిఫికెట్లు చూయించాల్సిందిగా కోరగా చూపించలేదు. గత నెలలోనూ ఇండియన్ మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీల్లోనూ రాజు ఎంబీబీఎస్ డాక్టర్‌నంటూ పేర్కొని సర్టిఫికెట్ చూపించకపోవడం గమనార్హం. రాజు దగ్గర ఎలాంటి విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు లేకపోవడంతో అధికారులు గ్లోబల్ క్లినిక్‌ను సీజ్ చేశారు. రాజుపై కేసులు నమోదు చేయించడంతోపాటు చర్యలు తీసుకుంటామని డాక్టర్ జీవరాజ్ తెలిపారు. లోటస్ క్లినిక్, లోటస్ డెంటల్ క్లినిక్‌లకు రిజిస్ట్రేషన్ లేకపోవడంతో నోటీసులు జారీ చేశారు. విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ లేకుండా దవాఖానలు నడిపే వారిపై, తెలిసీ తెలియని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ జీవరాజ్ హెచ్చరించారు. అలాగే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అర్హతలు ఉన్న వారు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాతే దవాఖానలు నడపాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు.

20న చలో.. కొడంగల్

దౌల్తాబాద్, డిసెంబర్ 6 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు గ్యారెంటీలు రైతు భరోసా పేరుతో మోసపూరిత హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయకుండా రైతులను మోసం చేశారని బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కూర వెంకటయ్య ముదిరాజ శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఈ నెల 20న నిర్వహిస్తున్న చలో కొడంగల్ వ్యవసాయ ఏడీఏ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆగస్టు 15న పూర్తి స్థాయి రుణమాఫీ చేస్తానని ప్రగల్భాలు పలికి 1, 2, 3, 4 విడుతల్లో రూ.2లక్షల వరకు ఉన్న రైతులకు పంట రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 50 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించిందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని రైతులు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై వ్యవసాయ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు.

అత్యాచార ఘటనలో 20 ఏండ్ల జైలు శిక్ష

మాడ్గుల, డిసెంబర్ 6 : మండల పరిధిలోని నాగిళ్ల గ్రామంలో 2017లో ఓ మహిళపై అఘాయిత్యం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన నిందితులను శుక్రవారం ఎల్బీనగర్ కోర్టు దోషులుగా నిర్ధారించిందని సీఐ జగదీశ్ తెలిపారు. వీరిలోప్రధాన ముద్దాయికి 20 ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ.6వేలు జరిమానా విధించిందని తెలిపారు. మిగతా వారికి మూడేండ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారని తెలిపారు. బాధితురాలికి రూ.3లక్షల పరిహారం అందజేసినట్లు తెలిపారు. వారిలో ఆ మనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లికి చెందిన షేక్ సజీద్ (27) ప్రధాన ముద్దాయి. మిగతా వారు గౌసియా(50), షేక్ సయీద్(34), షేక్ మహబూద్(32), షేక్ సలేహా(24) కడ్తాల్ మండల పరిధిలోని ముద్విన్ గ్రామానికి చెందిన కైరూన్ బేగం(40) ఉన్నారని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను ఎవరూ అడ్డుకోలేరు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ

ఆమనగల్లు, డిసెంబర్ 6 : ఎస్సీ వర్గీకరణను ఎవరూ అడ్డుకోలేరని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ అన్నారు. రిజర్వేషన్లలో తమ వాటాను తాము కోరడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతంపై సన్నాహక సమావేశం జిల్లా నాయకుడు మల్లేపోగు మల్లేశ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య మాదిగ, సీనియర్ నాయకులు వీరస్వామి మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మబ్బు సాయన్న మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలు జరగకుండా అడ్డుపడుతున్నది మాలల్లోని స్వార్థపరులేనని అన్నారు. వర్గీకరణకు 58 ఉపకులాలు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో హామీ ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా అమలు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. మాదిగలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేసి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మబ్బు రామరాజు మాదిగ, సీనియర్ నాయకులు దుబ్బు నాగేశ్ మాదిగ, కాటిక రామస్వామి మాదిగ, పులికంటి మైసయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు వగ్గు మహేశ్, నాయకులు కొప్పు యాదయ్య, కొప్పు జంగయ్య, బలరాం, ఈర్లపల్లి సింహాద్రి, జంతుక శంకర్, కర్రె సుదర్శన్, జంతుక కిరణ్, మీసాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఐటీ మంత్రి

విద్యార్థులు తయారు చేసిన ఎల్ఈడీ బల్బ్‌ను పరిశీలించి అభినందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కొడంగల్, డిసెంబర్ 6 : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తక్కువ ఖర్చుతో ఎల్ఈడీ బల్బ్‌ను తయారు చేయడాన్ని పురస్కరించుకొని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం విద్యార్థులను అభినందించారు. పట్టణంలో సెంట్రలైస్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించేందుకు హాజరైన మంత్రిని విద్యార్థులు కలిశారు. వృత్తి విద్య కోర్సు కింద తక్కువ ఖర్చుతో ఎల్ఈడీ బల్బ్‌ను రూపొందించగా దానిని మంత్రికి చూయించారు. విద్యార్థుల నైపుణ్యానికి మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాన్ని పెంచడమే కాకుండా భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజక్టుకు పూర్తి మద్దతు ఇస్తామని మంత్రి విద్యార్థులకు హామీ ఇచ్చారు.

షాద్‌నగర్ రూట్‌లో బస్సుల్లేక ఇబ్బందులు

ఆర్టీసీ అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న ప్రయాణికురాలు

పరిగి, డిసెంబర్ 6 : పరిగి నుంచి షాద్‌నగర్ రూట్‌లో శుక్రవారం సాయంత్రం సమయంలో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పరిగిలో అంగడి కావడంతో కూరగాయలు విక్రయించేందుకు, కొనుగోలు చేసేందుకు వివిధ గ్రామాల నుంచి వస్తారు. సాయంత్రం సమయంలో తిరుగు ప్రయాణానికి పరిగి బస్టాండ్‌కు వెళ్లగా షాద్‌నగర్ రూట్‌లో బస్సులు లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు. సాయంత్రం 6.30 గంటల నుంచి సుమారు గంటన్నరకు పైగానే షాద్‌నగర్ రూట్‌లో బస్సులు లేవని ప్రయాణికులు వాపోయారు. ఆర్టీసీ సిబ్బందిని అడిగితే ఇప్పుడే వస్తున్నదని సమాధానం వస్తున్నదని పేర్కొన్నారు. ఈ మేరకు డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు ఒక ప్రయాణికురాలు ఫోన్ చేసి షాద్‌నగర్ రూట్‌లో బస్సులు ఎప్పుడు వస్తాయి, ఎంతసేపు వేచి ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే చీకటి పడింది, ఇళ్లకు ఎప్పుడు వెళ్లాలంటూ ఆమె మండిపడ్డారు. రాత్రి 7.40గంటల ప్రాంతంలో బస్సు రావడంతో వారు తమ స్వగ్రామాలకు వెళ్లారు. షాద్‌నగర్ రూట్‌లో వెళ్లే ఒక ప్రైవేటు బస్సు టైరు పంక్చర్‌తో ఆలస్యం కాగా మరో బస్సు ఆలస్యంగా నడిచిందని, సాయంత్రం సమయంలో కొంతసేపు బస్సులకు ఇబ్బంది కలిగినా, సాధ్యమైనంత త్వరగానే బస్సు నడిచేలా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు.

బీఈ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్) బీఈ (నాన్ సీబీసీఎస్) బ్రిడ్జి కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 16వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎండీహెచ్ఎం పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీహెచ్ఎం మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఓయూ లైబ్రెరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ విభాగంలో పార్ట్ టైం లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 6: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని లైబ్రెరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ విభాగంలో పార్ట్‌టైం లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంలిబ్ఐఎస్సీ కోర్సును బోధించేందుకు అర్హులైన వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పూర్తి చేయడంతో పాటు నెట్, సెట్‌లో అర్హత సాధించడం లేదా పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 10వ తేదీ సాయంత్రం అయిదు గంటలలోపు తమ దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడతామని స్పష్టం చేశారు.

పత్తి పరిశోధనకు అనుమతులు

వ్యవసాయ వర్సిటీ వీసీ జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 6: తెలంగాణకు రెండు అఖిల భారత సమన్వయ పత్తి పరిశోధనా కేంద్రాలు (ఎఐసీఆర్పీ) మంజూరయ్యాయని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య తెలిపారు. పత్తికి భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం, భారత వ్యవసాయ పరిశోధనా మండలి పరిధిలో పత్తి పరిశోధన చేసే సమన్వయ కేంద్రాలకు తెలంగాణ రాష్ట్రం గతంలోనే అనుమతి ఇవ్వడం అభినందనీయమన్నారు. గత నెలలో ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. టీపీ శర్మలను కలిసి తెలంగాణలో పత్తి పంట ప్రాధాన్యతను వివరించడం వల్ల, అఖిల భారత పత్తి సమన్వయ పరిశోధనా పథకంలో పీజేటీఏయూకు భాగస్వామ్యం కలిపించిందన్నారు. వరంగల్ ప్రధాన కేంద్రం, ఆదిలాబాద్‌లో ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఐసీఏఆర్ సిబ్బందిని, నిధులను కేటాయించి పీజేటీఏయూలో పత్తి పంటలపై పరిశోధనలను పునఃప్రారంభించి రైతులకు అండగా ఉండనున్నామని తెలిపారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రుణాల చెక్కును అందిస్తున్న రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

తాండూరు, డిసెంబర్ 6: మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా అర్బన్ డేను పురస్కరించుకొని శుక్రవారం తాండూరు పట్టణంలో మహిళా సహకార పొదుపు సంఘం సభ్యుల స్టాల్ ప్రదర్శన, మాతా శిశు దవాఖానలో మహిళా క్యాంటీన్‌ను శాసన మండలి ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు నేడు అద్భుతాలు సృష్టిస్తూ ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మహిళలు ఉపాధి కోసం ఇతరులపై ఆధార పడకుండా ఇతరులకు ఉపాధి అందించే స్థాయిలో ఉండాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. స్వయం శక్తితో ఎదిగి అందరికీ మార్గదర్శకత్వం వహించే స్థితిలో ఉండాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి 35 యూనిట్లు, బ్యాంకు లింకేజీ కిం